‘గడప గడప’లో ప్రజలతో మమేకం

- కొత్త ముచ్చుమర్రిలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’
- నియోజవర్గంలో ముగిసిన కార్యక్రమం
- 86 సచివాలయాల పరిధిలో, 152 గ్రామాల్లో పర్యటన
- అధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే ఆర్థర్

పగిడ్యాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం వలన ప్రజలతో మమేకమవ్వడానికి అవకాశం లభించిందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం కొత్త ముచ్చుమర్రి సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా కార్యక్రమం పూర్తయ్యింది. ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

162 రోజుల్లో పూర్తి

నియోజకవర్గంలోని కొత్తపల్లె మండలం గుమ్మాడాపురం నుంచి 2022 మే 11న ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో నియోజకవర్గంలోని 86 గ్రామ సచివాలయాలను 162 రోజుల్లో పూర్తి చేసే అదృష్టాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని ఎమ్మెల్యే అన్నారు. 152 గ్రామాలు తిరిగి 83,460 గృహాలను ప్రత్యక్షంగా సందర్శించే భాగ్యం గడప గడప ద్వారా కలిగిందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొత్త ముచ్చుమర్రి గ్రామ సచివాలయంలో ముగింపు కార్యక్రమం జరగడం మరింత ఆనందంగా ఉందన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కరించాలి

గ్రామాల్లో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఒక్కొక్క సచివాలయానికి రూ. 20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే వెల్లడించారు. సచివాలయాలకు కేటాయించిన నిధులను ప్రాధాన్యత కలిగిన సమస్యల పరిష్కారానికి వెచ్చించుకోవాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. కొత్త ముచ్చుమర్రిలో ప్రధానంగా 11 కేవీ విద్యుత్ మెయిన్ లైన్‌ను మార్చాలని చాలా మంది తన దృష్టికి తెచ్చారని దానిని వెంటనే మార్పు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ క్రాంతికుమార్‌కు ఆదేశించారు. అంతర్గత సీసీ రోడ్లు, పక్కాగృహాలు, సామాజిక భద్రత పింఛన్లు తదితర సమస్యలపై ఎస్సీ కాలనీవాసులు విన్నవించారని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఎంఈఓ సుభాన్, జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమాదేవి, సర్పంచ్ కాటం రాధమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పుల్యాల నాగిరెడ్డి, స్థానిక నాయకులు కాటం రమేష్‌కుమార్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, బోయ మధు, కాటం వెంకటరమణ, రాజు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

పోలీసుస్టేషన్‌కు సమాచామివ్వాలి

పాములపాడు: గ్రామాల్లోని విషయాలను ఎప్పటికప్పుడు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ అశోక్ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అధ్యక్షతన గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతల విషయంలో నిక్కచ్చిగా ఉండాలన్నారు. ఎంతటి వారైనా ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

బంద్‌కు సహకరించాలి

నందికొట్కూరు: బుధవారం నిర్వహించనున్న బంద్‌కు ప్రభుత్వ, కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు సంపూర్ణంగా సహకరించాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు శ్రీనివాసులు, కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు రంగస్వామి, వినోద్, దినేష్, విక్రమ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామి వారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్ర పాలకునిగా ప్రసిద్ధిగాంచిన శ్రీబయలు వీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. నందీశ్వరస్వామికి నానబెట్టిన శనగలను నైవేద్యంగా సమర్పించారు.

పాడి రైతుల అభివృద్ధికి ‘పశు విజ్ఞాన బడి’

పాములపాడు: పాడి రైతుల అభివృద్ధి కోసం పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పశు వైద్యాధికారి భాస్కర్ తెలిపారు. మంగళవారం మండలంలోని బానకచెర్ల గ్రామంలో నిర్వహించిన పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో ఆయన గొర్రెలు, మేకల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కోళ్లలో వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. నట్టల నివారణకు వ్యాక్సినేషన్ కచ్చితంగా వేయించాలని సూచించారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, పశువులకు వైద్యం కోసం 1962 నంబరుకు ఫోన్ చేయాలని చెప్పారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటనరసయ్య

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనరసయ్య అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తుందని, మానసికంగా దెబ్బతీస్తుందన్నారు. ప్రారంభంలోనే ఈ వ్యాధిని గుర్తిస్తే ఈ వ్యాధి నుంచి బయట పడవచ్చన్నారు. వైస్‌ప్రిన్సిపల్ పద్మావతి బాయి, కృష్ణ, అధ్యాపకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిపై ప్రణాళిక



పీఓ రవీంద్రారెడ్డికి ప్రణాళికను అందజేస్తున్న నాగేంద్రప్రసాద్

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) పరిధిలో నివసిస్తున్న చెంచుగిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం కోవెల్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ నాగేంద్రప్రసాద్ ప్రణాళికను రూపొందించి మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి.రవీంద్రారెడ్డికి అందజేశారు. ఈ ప్రణాళికను గిరిజనుల సంక్షేమం కోసం అభివృద్ధి కోసం అమలు చేస్తే ఫలితాలు మెరుగ్గా ఉంటాయన్నారు.

15న జనజాగృతి దివస్



గిరిజనులు ఉత్పత్తి చేసిన వస్తువులను పరిశీలిస్తున్న అధికారులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఐటీడీఏ ప్రాంగణంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈ నెల 15న జనజాగృతి దివస్‌ను నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి రవీంద్రారెడ్డి మంగళవారం తెలిపారు. గిరిజనులు తయారు చేసిన వస్తువులు, సేకరించిన ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ మేళాను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భారత ప్రభుత్వం తరఫున ట్రైబల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ శ్రీనివాస్ మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో గిరిజనులు తయారు చేసిన వస్తువులను, సేకరించిన అటవీ ఉత్పత్తులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ ఎస్ సురేష్, ఎన్ఆర్ఈ జీఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ పవన్‌కుమార్, వైకేపీ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కేజే నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టికెట్ రాదనే భయంతోనే డమ్మీ చేరికలు



నారా లోకేష్ పాదయాత్రలో ఉన్న ఫొటోను చూపుతున్న కొంగీస శివశంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు

- సొంత పార్టీ వారికే మళ్లీ కండువాలు
- మాజీ ఎమ్మెల్యే బుడ్డాపై వైఎస్సార్‌సీపీ నేతల ఆగ్రహం

మహానంది: మూడేళ్ల నుంచి టీడీపీలో ఉంటూ నారా లోకేష్ పాదయాత్రకు స్వాగతం పలికిన నాయకులకు మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మళ్లీ పార్టీ కండువాలు కప్పి పార్టీలో చేరారంటూ ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమని బండిఆత్మకూరు మండల అధ్యక్షుడు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, సంతజూటూరు గ్రామ నాయకుడు కొంగీస శివశంకర్ అన్నారు. టికెట్ రాదనే భయంతోనే డమ్మీ చేరికలకు తెరలేపారన్నారు. బండిఆత్మకూరు మండలం సంతజూటూరులో ఇటీవల 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ వీడి టీడీపీలో చేరారన్న డమ్మీ చేరికలపై ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం సంతజూటూరులో మండల ముఖ్య నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సర్పంచు ఎన్నికల నుంచే టీడీపీలో ఉన్నవారికి పార్టీ కండువాలు కప్పడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ఒక వైశ్య కుటుంబం చేరితో వందల కుటుంబాలు చేరినట్లు చెప్పుకోవటం సిగ్గుచేటన్నారు. పార్టీ ఫండ్ తీసుకుని తన భార్యకు ఆరోగ్యం బాగోలేదని మైండ్‌గేమ్ ఆడి వెనక్కి తగ్గిన మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని నమ్మి పోటీ చేయలేక ఎంతో మంది నామినేషన్లు వేశాక చేతులెత్తేసి విరమించుకున్నారన్నారు. టీడీపీలో రెగ్యులర్ ఆర్టిస్టులను ప్రజలు గమనిస్తున్నారన్నారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి జరగలేదని మాజీ ఎమ్మెల్యే చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సంతజూటూరులో రూ.20కోట్ల మేరకు ప్రజలకు లబ్ధి చేకూరిందని, వారిలో మీ పార్టీకి చెందినవారు లేరా అంటూ ప్రశ్నించారు. రైతుల పంటలకు సాగు నీటి కోసం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి లస్కర్‌లాగా పనిచేస్తుంటే విమర్శించడం తగదన్నారు. సమావేశంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి, సొసైటీ చైర్మన్ శివలింగం, మండల కోఆప్షన్ మెంబర్ జమాల్‌బాషా, నాయకులు అశోక్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ జాబితాలో చేరుస్తామని హామీ ఇస్తేనే మద్దతు

జూపాడుబంగ్లా: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చుతామని హామీ ఇచ్చే పార్టీలకే రాబోయే ఎన్నికల్లో మద్దతు ఇవ్వనున్నట్లు రజక సంక్షేమ సంఘం జిల్లా నాయకులు వేంపెంట రాంబాబు, వాడాల నాగరాజు, కేతూర్ మధు, లాయర్ చంద్రశేఖర్, నాయకుడు బస్తిపాటి మౌలాలి తెలిపారు. మంగళవారం జూపాడు బంగ్లాలో ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠ స్థలం వద్ద వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. రజకుల జనాభాను అనుసరించి చట్టసభల్లో సీట్లు కేటాయించాలన్నారు. టీటీడీ సహా అన్ని దేవాలయ కమిటీల్లో రజకులకు ప్రాధాన్యత కల్పించి, సభ్యులుగా నియమించాలని కోరారు. అనంతరం ఈనెల 26న గుంటూరులో నిర్వహించనున్న రజకుల ఆత్మగౌరవ సభ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు నాగన్న, డ్రైవర్ వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, ఆనంద్, నాగభూషణం పాల్గొన్నారు.

శ్రీశైలంలో ధర్నాలు, నిరసనలు నిషేధం

- ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు
- లలితబజార్ వ్యాపారులతో సమావేశం

శ్రీశైలం: శ్రీశైలమహాక్షేత్రంలో ధర్నాలు, నిరసనలు చేయడం నిషేధమని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. లలితాబజార్ కాంప్లెక్స్ వద్ద ఇటీవల దుకాణదారులు ధర్నా చేయడంపై విచారణ నిమిత్తం మంగళవారం స్థానిక కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. దేవస్థానం ఈఓ డి పెద్దిరాజు, ఏసీ వెంకటేష్, ఏఈఓ ఫణీదర ప్రసాద్, సీఐ దివాకర్ రెడ్డిలతో కలిసి ఆయన జరిగిన పరిణామాలపై సమీక్షించారు. ఈఓ మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనల మేరకు షాపుల నిర్మాణం, కేటాయింపు జరుగుతుందన్నారు. తాము సొంతంగా ఒకరి లబ్ధికోసమో, ఇతర ప్రోద్బలంతోగానీ సొంత నిర్ణయాలు తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. క్షేత్ర పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత దుకాణదారులతో పాటు స్థానికులపై ఉందన్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ఏ సమస్యకైనా పరిష్కారం ఉంటుందని, అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. దుకాణదారులు ధర్నా చేయడం సబబు కాదన్నారు. ధర్నాలు, నిరసనలు పునరావృతం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు లక్ష్మణరావు, గంగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

సత్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

శ్రీశైలమహాక్షేత్రంలో ఈ నెల 14 నుంచి కార్తీక మాసోత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో అన్ని సత్రాలలో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని డీఎస్పీ శ్రీనివాసరావు ఆదేశించారు. క్షేత్రపరిధిలోని సత్రాల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వసతి గదుల బుకింగ్ కేంద్రం, భోజన శాల తదితర ప్రదేశాల్లో హై డైమెన్షన్ కెమెరాలు ఏర్పాటు చేయడం వలన అవాంఛనీయ సంఘటనలు నివారించవచ్చన్నారు. ఒకవేళ సంఘటనలు చోటు చేసుకున్నా సీసీ ఫుటేజ్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఏడాది క్రితం చంద్రశేఖర్ వీఐపీ కాటేజ్ లో బంగారం, నగలు చోరీ జరిగిందని గుర్తు చేశారు. అక్కడ సీసీ కెమెరాలు లేకపోవడం వలన నిందితులను పట్టుకోవడానికి ఏడాది కాలం పట్టిందన్నారు. సత్రాల్లో ఈ లాకర్ సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో టూ టౌన్ ఎస్ఐ గంగయ్య యాదవ్, సత్రాల మేనేజర్లు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

మహానంది : మండలంలోని తమ్మడపల్లె గ్రామం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల వద్ద మంగళవారం రాత్రి బైకు అదుపు తప్పడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. అల్లినగరం గ్రామానికి చెందిన దంపతులు బైక్‌పై నంద్యాల నుంచి గ్రామానికి వస్తుండగా సూచిక లేకపోవడంతో స్పీడ్‌బ్రేకర్ గమనించకపోవడంతో అదుపుతప్పి కిందపడింది. దీంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరూ గాయపడ్డారు. వీరిని నంద్యాల ఆసుపత్రికి తరలించారు.

9 నుంచి ‘పల్లెకు పోదాం’

నందికొట్కూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 9వ తేదీ నుంచి పల్లెకు పోదామని కార్యక్రమం నిర్వహిస్తునట్లు మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1, 3, 5, 7, 9, 10, 11, 12, 13, 14 సచివాలయాల పరిధిలో కార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ఏబీఎం పాలెంలో ఈ నెల 9న, 10న బ్రహ్మంగారి మఠం ఏరియా, 14న కోటవీధి, 15న మారుతీనగర్, 16న సంగయ్యపేట, 17న హౌసింగ్ బోర్డు కాలనీ, 20న సాయిబాబాపేట, 21న హజీనగర్, 22న సుబ్బారావుపేట, 23న బీఆర్ఆర్ నగర్(కర్నూలు రోడ్డు)లో పల్లెకుపోదాం కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

కొత్తపల్లి: ఈనెల 9వ తేదీ దుద్యాల, 10న నందికుంట, 14న గోకవరం, 15 గువ్వలకుంట్ల, 16న కొక్కెరంచ, 17న కొత్తపల్లి, 20న ముసలిమడుగు, 21 పెద్ద గుమ్మడాపురం, 22న శివపురం, 23 వ తేదీన ఎర్రమఠం గ్రామాలలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మేరి వివరించారు.

జూపాడుబంగ్లా: ఈనెల 9నుంచి ‘పల్లె కు పోదాం’ కార్యక్రమం ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ నెల 9న 80బన్నూరు, 10న జూపాడుబంగ్లా-1 , 14న జూపాడుబంగ్లా-2 సచివాలయం, 15న మండ్లెం-1, 16న మండ్లెం-2 సచివాలయం, 17న పారుమంచాల, 20న తంగడంచ, 21న తరిగోపుల, 22న తర్తూరు 23న తాటిపాడు సచివాలయాల్లో కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

మహిళలు అభివృద్ధి పథంలో నడవాలి

జూపాడుబంగ్లా: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు అభివృద్ధి పథంలో నడవాలని ఏపీఎం అంబమ్మ సూచించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో జీవనజ్యోతి మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ పొదుపు మహిళలు వారు సంపాదించిన మొత్తంలో ప్రతి నెలా కొంత మొత్తాన్ని పొదుపు చేసుకోవటం వల్ల భవిష్యత్‌లో ఉపయోగపడుతాయన్నారు. అనంతరం జీవనజ్యోతి మండల మహిళా సమాఖ్య నూతన కమిటీ అధ్యక్షురాలిగా లావణ్య, ఉపాధ్యక్షురాలిగా మల్లేశ్వరి, కార్యదర్శి కరిమూన్, సహాయ కార్యదర్శి మరియమ్మ, కోశాధికారి రవణమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో సీసీలు నాగన్న, గాంధీ, నాయక్, నాగేశ్వరరావు, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో లస్కర్ మృతి

పగిడ్యాల: కర్నూలు సబ్ డివిజన్ నందికొట్కూరు సెక్షన్‌లో కేసీ కాలువ 89వ స్లూయిస్ లస్కర్‌గా పనిచేస్తున్న పి.కురుమన్న(52)మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై మృతి చెందా డు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పుల్యాల నాగిరెడ్డి, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న అతని భౌతికదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నీటిపారుదల శాఖ ఏఈలు నరేష్, శ్రీనివాసులు నాయక్, ఔట్‌సోర్సింగ్ లస్కర్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు నాగన్న, మృతుని కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబీకులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపి సంతాపం ప్రకటించారు.

నీటి ఎద్దడి నివారణకు సత్వర చర్యలు

ఆత్మకూరు: వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మంచినీటి ఎద్దడి నివారణకు సత్వర చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ ఆదేశించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మంచినీటి ఎద్దడి నివారణపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు అధికంగా ఉన్నందున వేసవిలో తీవ్ర మంచినీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందన్నారు. కావున ఇప్పటి నుంచే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, సర్పంచ్‌లు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని గ్రామాల్లో జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ శుద్ధ జలాలు అందించాలని, ప్రతి ఇంటికి ఒక్కొక్కరికి 50 లీటర్ల నీటిని సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, ఏఈ సువత్సల, సర్పంచ్‌లు నారాయణ రెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

వెలుగోడు: భూమి, భుక్తి, విముక్తి కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి కర్నూలు జిల్లా కమిటీ కార్యదర్శి వై నరసింహులు అన్నారు. పట్టణంలో చంద్ర పుల్లారెడ్డి స్తూపం వద్ద అమరవీరుల సంస్మరణ సభను సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాజకీయ నిర్మాణ సిద్ధాంతరంగంలో పోరాటానికి నాయకత్వం వహిస్తూ అమరులైన భారత విప్లవ రథసారథుల్లో ఒకరైన చంద్ర పుల్లారెడ్డి నవంబర్ 9న అమరులయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అరుణ్ కుమార్, ఏఐకేఎంఎస్ జిల్లా కోశాధికారి గోపాల్, జిల్లా నాయకులు ప్రేమ రాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జునైద్ బాషా, రేవల్లే రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సమాన హక్కులు కల్పించాలి

ఆత్మకూరు: మహిళలకు సమాన హక్కులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సుగుణమ్మ అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం తాలూకా మహాసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళల పట్ల చిన్నచూపు చూస్తోందని, వారి హక్కులను కాలరాస్తోందన్నారు. ఈ నెల 17న నంద్యాల పట్టణంలో జరిగే ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకురాళ్లు శాంత కుమారి, మూర్తి, రామలక్ష్మమ్మ, సూరమ్మ, నాగశేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి



అమ్మవారి ఆశీర్వచన మండపంలో మంత్రి మేరుగ నాగార్జున

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం ట్రస్ట్ బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ డి.పెద్దిరాజు, అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు వారికి ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. ట్రస్ట్‌బోర్డు మెంబర్లు హనుమంత్ నాయక్, తన్నీరు ధర్మరాజు తదితరులు ఉన్నారు

అంతర పంటలు సాగు చేయాలి

నందికొట్కూరు రూరల్ : మండలంలో ఉద్యాన పంటలను సాగు చేసే రైతులు అంతర పంటలను వేసుకోవడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని ఉద్యాన శాఖ అధికారిణి చందన తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో పండ్ల తోటలను సాగు చేసిన రైతులకు యాజ మాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించా రు. ఆమె మాట్లాడుతూ పండ్ల తోటల మధ్య అంతర పంటలైన మినుము, శనగ, పెసర పంటలను వేసుకోవాలని సూచించారు. తోటల్లో తెగుళ్ల నివారణకు తగిన మోతాదులో మందులను ఉపయోగించాలన్నారు. ఏపీవో అలివేలు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి జగనన్నను ఆశీర్వదించేలా చేద్దాం

జూపాడుబంగ్లా: ప్రజలు మరోపర్యాయం జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా ఆశీర్వదించేలా మండలంలోని అన్ని గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు కృషిచేయాలని జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, ఎంపీపీ సువర్ణమ్మ, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జున రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 9 నుంచి ఏపీ కి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగనన్న తన పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, వాటి వల్ల లబ్ధిపొందిన ప్రజల సంఖ్య, మొత్తం వివరాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ గృహసారథులు, వలంటీర్లు పాల్గొనాలని తెలిపారు. అనంతరం మానమ్మకం నువ్వే జగన్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రెటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తరుణ్‌కుమార్‌రెడ్డి, సుంకన్న, ఆనంద్ రజక, శేఖర్ రెడ్డి, మన్సూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



మానమ్మకం నువ్వే జగన్ జెండాలను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు

చెరువుల సర్వే పక్కాగా చేయండి

జూపాడుబంగ్లా: చెరువులపై చేస్తున్న సర్వే పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ ఏఎస్ఓ హనుమంతుకు సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని చెరువులు, నీటికుంటలు, చెక్ డ్యాంలపై మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న సర్వేను తహసీల్దార్ మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెరువులకు సంబంధించిన వివరాలు, ఎన్ని ఎకరాల ఆయకట్టు ఉంది, ప్రస్తుతం ఎన్ని ఎకరాలకు సాగునీరు అందుతుంది అనే విషయాలకు సంబంధించిన గణాంకాలను పక్కాగా సేకరించాలన్నారు. కార్యక్రమంలో ఉపగణాంకాధికారి హనుమంతు, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని తూడిచెర్లలో కొనసాగుతున్న భూ రీ సర్వేను పరిశీలించారు. త్రీడీ ప్రింట్లను పరిశీలించిన తహసీల్దార్ వాటిని అనుసరించి ఎంత మేర భూమిని సర్వేచేశారు అనే వివరాలు తెలుసుకున్నారు.



పారుమంచాల చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్ పుల్లయ్యయాదవ్

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

ఆత్మకూరు: రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన వైద్యం జగనన్న ఆరోగ్య సురక్షతోనే సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అన్నారు. పట్టణంలోని ఎస్పీజీ పాలెం సచివాలయ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నిరుపేదకు వైద్యం అందాలనే ఉద్దేశంతో ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. వైద్య శిబిరాల ద్వారా ఎన్నో రోగాలు బయట పడుతున్నాయని చెప్పారు. అనంతరం రోగులను స్వయంగా పరీక్షించి చికిత్స అందిచారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కో ఆప్షన్ సభ్యుడు ఎంఏ రషీద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, వైస్ చైర్మన్ రాజగోపాల్, కౌన్సిలర్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



మహిళకు వైద్య పరీక్ష నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

నేడు ‘జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం’

పట్టణంలోని రహమత్‌నగర్ సచివాలయ పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. సచివాలయ పరిధిలోని వివిధ కాలనీల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి వార్డునూ తీర్చిదిద్దుతాం

నందికొట్కూరు: పట్టణంలోని ప్రతి వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 4వ వార్డులో కౌన్సిలరు బోయ జయమ్మ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్, కమిషనర్ కిషోర్ పర్యటించారు. వడ్డేపేట ఆర్చీని చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి ప్రభుత్వం రూ.20 కోట్లకు పైగానే నిధులు మంజూరు చేసిందన్నారు. 4వార్డు అభివృద్ధికి రూ. 60 లక్షల వరకు కేటాయించినట్లు తెలిపారు. డ్రైనేజి నిర్మాణాలకు రూ. 55 లక్షలు, సీసీ రోడ్లకు రూ. 5 లక్షలు వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. షాదీఖానా నిర్మాణ పనులు వేగవంతం జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఈయన వెంట కౌన్సిలర్లు లాలు, హమీద్, నాయబ్, చాంద్‌బాషా, రవూఫ్, వైఎస్సార్‌సీపీ నాయకులు లడ్డూ, సమీవుల్లా, రమేష్, కురవ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలిని అడిగి సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి